తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం - 30- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 56 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# 7,437 పోస్టుల భర్తీ

## తెలంగాణ హోంశాఖలో

- దరఖాస్తులకు ముందు అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచన
- పోలీస్, ఎస్‌పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో భారీగా ఖాళీలు

2లో



# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదించిన సభ
- పేపర్ లీక్‌లపై మరింత కఠిన శిక్షలకు మార్గం సుగమం

**న్యూఢిల్లీ, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

పరీక్షల్లో అక్రమాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యులు "మాకు న్యాయం కావాలి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పటికీ, మూజువాణి ఓటుతో బిల్లును సభ ఆమోదించింది. బిల్లును ఉభయసభల సంయుక్త కమిటీకి పంపాలని కొందరు సభ్యులు చేసిన డిమాండ్లు, వారు ప్రతిపాదించిన సవరణలను స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించినట్లు ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో సవరణలు తీసుకొచ్చామని ఆయన తెలిపారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో




# గ్రామాభివృద్ధిపై మంత్రి సమీక్ష

- హుస్నాబాద్‌లో మండల స్థాయి సమావేశం
- పంచాయతీల అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం
- వర్షా భావ పరిస్థితులకు ముందస్తు చర్యలు
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

హుస్నాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో మంత్రి చర్చించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

మిగతా 2లో

## తెలంగాణ ప్రాజెక్టులకు

# సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఊరట
- పాలమూరు–రంగారెడ్డి సహా ప్రాజెక్టులకు మార్గం
- 2021 కేంద్ర ఆఫీస్ మెమోరాండం రద్దు
- ముందస్తు పర్యావరణ అనుమతులే తప్పనిసరి
- ప్రత్యేక నోటిఫికేషన్‌తోనే మినహాయింపులు సాధ్యం

2లో



# రాహుల్ వ్యాఖ్యలపై దుమారం

- ఆర్ఎస్ఎస్, అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు
- పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం
- వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని అధికార పక్షం డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బుధవారం పార్లమెంట్‌లో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలకు అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత విద్యా వ్యవస్థ ఆర్ఎస్ఎస్ ప్రభావంలోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నామమాత్రపు పాత్ర మాత్రమే పోషిస్తున్నారని, విద్యా వ్యవస్థను తెరవెనుక ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని విమర్శించారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ప్రతికూలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

మిగతా 2లో



# రాహుల్ క్షమాపణ చెప్పాలి

- పార్లమెంట్ వ్యాఖ్యలపై రాంచందర్‌రావు విమర్శలు
- "ఇడియట్" పదంపై అభ్యంతరం
- విద్యార్థుల పట్ల కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టిన బీజేపీ
- తెలంగాణ ఉద్యమాలను ప్రస్తావించిన రాష్ట్ర అధ్యక్షుడు

**హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

పార్లమెంట్‌లో ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉపయోగించిన "ఇడియట్" అనే పదం పార్లమెంటరీ మర్యాదలకు విరుద్ధమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. ఆ వ్యాఖ్యలపై దేశ ప్రజలకు రాహుల్ గాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న వైఖరికి ఈ వ్యాఖ్యలే నిదర్శనమని రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థి ఉద్యమాలను అవమానించడం, అణచివేయడం, నిర్దాక్షిణ్యంగా అణిచివేయడం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచే అలవాటుగా మారిందని ఆరోపించారు.

మిగతా 2లో

# ఉగ్రరూపంలో బొగత జలపాతం

- భారీ వర్షా లతో పెరిగిన వరద ఉద్ధృతి
- పర్యాటకుల ప్రవేశంపై తాత్కాలిక నిషేధం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- భద్రతా చర్యలు ముమ్మరం



**ములుగు, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లా వాజేడు మండలంలోని ప్రసిద్ధ బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఎగువ అటవీ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో జలపాతం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గత పది గంటలుగా అటవీ ప్రాంతంలో కురుస్తున్న నిరంతర వర్షాలతో జలపాతంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. భారీ వరద ప్రవాహంతో జలపాతం పరిసర ప్రాంతాలు ప్రమాదకరంగా మారడంతో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను అటవీ శాఖ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పర్యాటకులను అనుమతించబోమని స్పష్టం చేశారు. వరద ఉద్ధృతి కారణంగా రాళ్లు జారిపడే ప్రమాదం ఉండటంతో పాటు నీటి ప్రవాహం

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపెల్లి రాజేష్ తెలుగు దిన పత్రిక

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు.



చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ దేశంలో 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభా సంప్రదాయాలకు విరుద్ధమైన, అప్రజాస్వామిక పదజాలాన్ని ఉపయోగించారని విమర్శించారు. పార్లమెంటరీ నిబంధనలను గౌరవిస్తూ చర్చ జరగాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమని వ్యాఖ్యానించారు. కాల్పుల ఆదేశాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను కూడా జితేంద్ర సింగ్ ఖండించారు. కాల్పులకు ఆదేశాలు ఇచ్చేది మంత్రి కాదని, మేజిస్ట్రేట్ మాత్రమే అలాంటి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. అసలు కాల్పులు జరగలేదని, బాష్పవాయువు మాత్రమే ప్రయోగించారని చెప్పారు. అలాగే కేంద్ర హోంమంత్రి విదేశాల్లో ఉన్నారన్న ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు.

చట్ట సవరణల ప్రకారం పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే సేవల సంస్థలకు విధించే జరిమానాను రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచడంతో పాటు, వాటిపై నిషేధాన్ని నాలుగేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వరకు పొడిగించే నిబంధనను చేర్చారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాల్లో పాల్గొన్న సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులకు కనీసం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 కోట్ల వరకు జరిమానా విధించేలా బిల్లులో నిబంధనలు ఉన్నాయి. పెద్ద ఎత్తున జరిగే పరీక్షా కుంభకోణాలకు కనీస శిక్షను ఏడేళ్లకు, కనీస జరిమానాను రూ.10 కోట్లకు పెంచే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అలాగే పరీక్షా అక్రమాల దర్యాప్తు కోసం ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసి, రెండు నెలల్లోపు దర్యాప్తు పూర్తి చేసే విధంగా బిల్లులో నిబంధనలు చేర్చారు.

## రాహుల్ వ్యాఖ్యలపై దుమారం

(మొదటి పేజీ తరువాయి)

నీట్ పరీక్ష అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని ప్రస్తావించిన రాహుల్ గాంధీ, ఆ సందర్భంగా జరిగిన పోలీసు చర్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఆరోపించారు. నిరసనకారులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రి అనుమతి ఇచ్చారని పేర్కొంటూ ప్రభుత్వ తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు.

రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఆధారాలు లేకుండా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరికాదని, వెంటనే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బాధ్యతాయుతమైన చర్చలు జరగాలని సూచించారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, సభలో చేసే ఆరోపణలకు స్పష్టమైన ఆధారాలు ఉండాలని సభ్యులకు సూచించారు. ప్రజాప్రతినిధులు పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించాలని, వ్యక్తిగత ఆరోపణల విషయంలో సంయమనం అవసరమని స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు సభ్యులు తమ స్థానాల నుంచి నిరసన వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాలు అంతరాయం కలిగాయి. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్పీకర్ లోక్‌సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

## రాహుల్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన 369 మంది విద్యార్థులు కాంగ్రెస్ పాలనలో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆ సంఘటనలు మరువలేనివని ఆయన అన్నారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ జాప్యం, రాజకీయ నిర్ణయాల కారణంగా సుమారు 1,200 మంది యువకులు, విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని రాంచందర్‌రావు ఆరోపించారు. విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని, ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు, వారి ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించలేదని రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థుల ఉద్యమాలను అణచివేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని, ఇప్పుడు కూడా అదే ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు.

రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు వివరణ ఇవ్వడంతో పాటు క్షమాపణ చెప్పాలని రాంచందర్‌రావు పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాలని, ప్రజా జీవితంలో బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించడం అవసరమని ఆయన పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):

పర్యావరణ అనుమతుల (ఈసీ) విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు తెలంగాణ రాష్ట్రానికి భారీ ఊరటనిచ్చింది. పర్యావరణ అనుమతులు తీసుకోకుండా పనులు ప్రారంభించిన భారీ ప్రాజెక్టులకు వెనుకటి తేదీతో (ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో) అనుమతులు మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను అత్యున్నత న్యాయస్థానం బుధవారం రద్దు చేసింది. అయితే గతంలో ఉన్న అనిశ్చితి, ప్రాజెక్టుల్లో ఇమిడి ఉన్న ప్రజాధనాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే (ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్) వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో పాత అనుమతులకు రక్షణ లభించి, తెలంగాణలో నిలిచిపోయిన పలు కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

గతంలో పర్యావరణ అనుమతుల విషయంలో ఎదురైన న్యాయపరమైన చిక్కుల వల్ల పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్, దిండి ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఈ ప్రాజెక్టులకు మార్గం సుగమమైంది. పాత అనుమతులు రద్దు కాకపోవడం, భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా మినహాయింపులు పొందే అవకాశం ఉండటం రాష్ట్ర సాగునీటి రంగానికి వరంగా మారింది. వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది.



భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందస్తుగా అనుమతులు తీసుకోవడం ప్రాథమిక నిబంధన అని తేల్చిచెప్పింది. ముందస్తు అనుమతులు లేని ప్రాజెక్టులను క్రమబద్ధికరించేందుకు కేంద్రం 2021లో జారీ చేసిన ఓఎం ఒక శాశ్వత మార్గాన్ని ఏర్పాటు చేసిందని ధర్మాసనం తప్పుబట్టింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986, ఈఐఏ నోటిఫికేషన్-2006 నిబంధనలను పరిపాలనా ఉత్తర్వు ద్వారా తొలగించడం చట్టసమ్మతం కాదని చెప్పింది. ఏ ప్రాజెక్టులకు మినహాయింపు ఇవ్వాలనే దానిపై స్పష్టమైన ప్రమాణాలు లేకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కు, స్వచ్ఛమైన పర్యావరణం)ల ఉల్లంఘనే అని స్పష్టం చేసింది. ముందస్తు అనుమతి నిబంధన ప్రాథమికమైనప్పటికీ, అత్యంత అరుదైన, భారీ ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ప్రాజెక్టుల విషయంలో చట్టంలోని సెక్షన్ 3 కింద పరిమిత కాలానికి ప్రత్యేక మినహాయింపు నోటిఫికేషన్లు జారీ చేసే అధికారం కేంద్రానికి ఉంటుందని ధర్మాసనం చెప్పింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసర ప్రాజెక్టులను క్రమబద్ధికరించడానికి చట్టబద్ధమైన నోటిఫికేషన్ తీసుకురావాలి తప్ప, దొడ్డిదారిన ఆఫీస్ మెమోల ద్వారా అనుమతులు మంజూరు చేయడం చెల్లదని చెప్పింది.

వివిధ కేసుల్లో గతంలో ఇచ్చిన తీర్పుల వర్తింపుపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. కామన్ కాజ్ (2017), అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ (2020) కేసుల్లో ముందస్తు పర్యావరణ అనుమతి ఆవశ్యకతను సమర్థించిన విషయాన్ని గుర్తుచేసింది. పహ్వా ప్లాస్టిక్స్ (2022), డి.స్వామి (2022) కేసులు నిర్దిష్ట పరిస్థితుల్లో ఇచ్చినవని, వాటిని సాధారణ సూత్రాలుగా పరిగణించలేమని తెలిపింది. పర్యావరణ చట్టాలు పోస్ట్ ఫ్యాక్టో అనుమతులకు వీలు కల్పిస్తాయంటూ ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ (2021) కేసులో చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుడు వ్యాఖ్యానమంటూ వాటిని తప్పుబట్టింది. అయితే 2017లో ఇచ్చిన వన్-టైమ్ మినహాయింపు నోటిఫికేషన్ చెల్లుబాటును మాత్రం అంగీకరించింది.

## ఉగ్రరూపంలో బొగత జలపాతం

(మొదటి పేజీ తరువాయి)

అకస్మాత్తుగా మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఎవరూ జలపాతం వద్దకు వెళ్లే ప్రయత్నం చేయవద్దని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జలపాతం పరిసర ప్రాంతాల్లో పోలీసులు, అటవీ శాఖ అధికారులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ఉద్ధృతి తగ్గి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత మాత్రమే పర్యాటకులను అనుమతించే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. అప్పటి వరకు ప్రజలు, పర్యాటకులు అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## 7,437 తెలంగాణ హోంశాఖలో పోస్టుల భర్తీ

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ హోంశాఖలో మరోసారి కొలువుల జాతర మొదలైంది. 7,437 పోస్టుల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నోటిఫికేషన్‌లు జారీ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖలకు సంబంధించి వేర్వేరుగా నాలుగు ప్రకటనలు వెలువడ్డాయి. వీటిలో కానిస్టేబుల్, ఆ స్థాయి పోస్టులే దాదాపు 7 వేలు ఉండటం ప్రాధాన్యం సంతరించుకొంది. అభ్యర్థులు మండలి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుల స్వీకరణ తేదీని ఇంకా ప్రకటించలేదు. దరఖాస్తు ప్రొఫార్మాను త్వరలోనే వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు మండలి ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. అభ్యర్థులు శారీరక, వైద్య ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలు చేసే ముందే తెలంగాణలో స్థానికులైన అభ్యర్థులు కొన్ని ధ్రువపత్రాలను సమకూర్చుకోవాలని మండలి సూచించింది.

ఎస్సీ అభ్యర్థులు... ఎస్సీ గ్రూప్1, 2, 3 ఉపవర్గీకరణతో కూడిన తాజా సామాజిక ధ్రువపత్రం.

ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా బలహీనవర్గాలు) అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ప్రభుత్వం నుంచి పొందిన ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణపత్రం...

బీసీ అభ్యర్థులు ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న నాన్‌క్రీమీలేయర్ సర్టిఫికెట్...

అభ్యర్థులంతా 17 తరగతుల వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు లేదంటే నివాస ధ్రువీకరణపత్రం (రెండింటిలో ఏవి వర్తిస్తే అవి).

దివ్యాంగ, స్పోర్ట్స్ తదితర ప్రత్యేక కేటగిరీల కింద అర్హులైతే సంబంధిత ధ్రువపత్రాలు.

**అగ్నిమాపకశాఖలో ఖాళీలు..**

స్టేషన్ ఫైర్ ఆఫీసర్: **39**

ఫైర్ ఫైటర్: **751**

**జైళ్ల శాఖలో..**

డిప్యూటీ జైలర్(పురుషులు): **14**

డిప్యూటీ జైలర్(మహిళలు): **1**

వార్డర్(పురుషులు): **196**

వార్డర్(మహిళలు): **12**

**ప్రత్యేక రక్షణ దళం(ఎస్‌పీఎఫ్)లో..**

ఎస్సై: **44**

కానిస్టేబుల్: **1,380**




## గ్రామాభివృద్ధిపై మంత్రి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, వ్యవసాయ అవసరాలు, పశువుల సంరక్షణ, నీటి వనరుల పరిరక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీల సామర్థ్యాన్ని పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. స్థానిక అవసరాలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టాలని, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఐలయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, వర్షాభావ పరిస్థితులకు తీసుకోవాల్సిన చర్యలపై వారు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కవిత

- యశోద ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):



సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందుతున్న వైద్యం, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన కవిత, చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. వైద్య బృందం అందిస్తున్న సేవలను గురించి కూడా ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి భార్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెబుతూ, ఆయన త్వరగా కోలుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తనతో కలిసి ఉద్యమంలో పనిచేసిన సహచరుడు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులకు కవిత భరోసా కల్పించారు. ప్రస్తుతం ఆయనకు యశోద ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

## భూ వివాదం విషాదం.. మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



- **తల్లి మృతితో మల్యాల గ్రామంలో విషాద ఛాయలు**

**ఇల్లందకుంట, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** భూ వివాదం కుటుంబంలో తీవ్ర విషాదానికి దారితీసిన ఘటన ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలో చోటుచేసుకుంది. భూ తగాదా నేపథ్యంలో కుమార్తె చేతిలో అవమానానికి గురైన ఓ మహిళ మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందింది.

పోలీసుల వివరాల ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన చందగల్ల శంకరయ్య (66) తన చిన్న కుమార్తె రామంచ శైలజ (35), ఆమె భర్త ఆరోగ్యంపై ఇల్లందకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూ వివాదం విషయంలో శైలజ తన తల్లి చందగల్ల లక్ష్మి (60)తో ఘర్షణకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మిపై దాడి చేసి, ఇంటి వరకు ఈడ్చుకెళ్లినట్లు ఆరోపించారు.

ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను హుజూరాబాద్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇల్లందకుంట ఎస్‌హెచ్‌ఓ క్రాంతి కుమార్ తెలిపారు. కుటుంబ కలహాలు చివరకు ప్రాణం తీసిన ఈ ఘటన మల్యాల గ్రామంలో విషాదాన్ని నింపింది.

## జలసిరి కార్యక్రమంపై గ్రామసభ నిర్వహణ



**వేలేరు, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేలేరు తహసీల్దార్ శ్రీమతి కోమి, మండల అభివృద్ధి అధికారి ఎంపీడీఓ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్, తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును సంరక్షించే లక్ష్యంతో "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత - ప్రతి పంటకు పంట కుంట" కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా ప్రతి ఇంకుడు గుంతకు రూ.6,500 ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు, రైతులకు ఉచితంగా పంట కుంటలు ఏర్పాటు చేసి, ఉచిత చేప పిల్లలను కూడా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రతి గ్రామస్థుడు, రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ గ్రామసభలో మండల ఎంపీవో బుచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ, ఎస్ బి ఐ బ్యాంక్ స్థానిక మేనేజర్ భిక్షపతి, హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ ఓ సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్, ఐకేపీ సీసీ రమాదేవి, విద్యాశాఖ ప్రతినిధి లీలాబాయి, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులు, వార్డు సభ్యులు సంధ్య, పర్వీన్, మౌనిక, చైతన్య, లక్ష్మీనారాయణ, కృపసాగర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం.. ప్రమాదాల నివారణే ధ్యేయం






**ఇల్లందకుంట, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ సూచనల మేరకు ఇల్లందకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలు, కుటుంబ భద్రత, సురక్షిత ప్రయాణంపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

ముఖ్య అతిథిగా హాజరైన రోడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ ఎన్. ధనరాజ్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

ఇల్లందకుంట ఎస్ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడే రక్షణ కవచాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత విషయంలో విద్యార్థులే మార్పుకు దూతలుగా మారాలని, కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్నీమ్ నస్రీన్, మండల విద్యాధికారి కె. రాములు, గ్రామ సర్పంచ్ దార సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాన్నీ లెక్కచేయని అన్నపూర్ణ సేవా సమితి





- **నిరంతర నిత్యాన్నదాన సేవ**

**జమ్మికుంట టౌన్ జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (బొమ్మల గుడి)లో అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా దాతల సహాయ సహకారాలతో నిరంతర నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు సేవా స్ఫూర్తితో ముందుకు వచ్చి భక్తులకు, అవసరమైన వారికి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా సేవా కార్యక్రమాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా సమితి సభ్యులు అంకితభావంతో పనిచేయడం పలువురి ప్రశంసలు అందుకుంది. సేవే పరమో ధర్మః అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తున్న అన్నపూర్ణ సేవాసమితి సేవలను భక్తులు, స్థానికులు అభినందించారు.

## వరద ముప్పుపై అప్రమత్తం.. రంగంలోకి దిగిన మున్సిపల్ చైర్మన్






**జమ్మికుంట టౌన్ జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో స్వల్ప వర్షానికే నీటిమునిగే ప్రాంతాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ చర్యలు వేగవంతం చేశారు. బుధవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీతో పాటు హుజూరాబాద్ రహదారి నుంచి వచ్చే వర్షపు నీరు శ్రీరామ హాస్పిటల్ ప్రాంతంలో నిలిచిపోతున్న పరిస్థితిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించిన చైర్మన్, మున్సిపల్ జేసీబీ యంత్రంతో ప్రత్యేకంగా డ్రైన్లను శుభ్రం చేయిస్తూ పనులను స్వయంగా పర్యవేక్షించారు.

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలన్నింటిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచే పనులు కొనసాగుతాయని చైర్మన్ తెలిపారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైన్లలో వేయకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీపతి నరేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గురువే దైవం.. గురు పౌర్ణమి సందర్భంగా గురువులకు విశిష్ట సత్కారం



**భీమదేవరపల్లి, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని శ్రీ విశ్వేశ్వర ఆలయంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు రిటైర్డ్ ఉపాధ్యాయులు మన్మోహన్ రెడ్డి, తారాబాయి, కోడూరు సరోజన, లక్ష్మయ్య, పీ.ఈ.టీ శ్రీ రాజిరెడ్డి, బండారి రత్నాకర్ దంపతులు, గద్ద కొమురన్న సతీమణితో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గురువులను సన్మానించుకోవడం తమకు ఎంతో ఆనందంగా, గర్వకారణంగా ఉందన్నారు. గురువుల ఆశీస్సులతో సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన గురువులకు, వారి కుటుంబ సభ్యులకు శ్రీ విశ్వేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి వారి అనుగ్రహంతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాసాగోని భగత్ సింగ్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

- **దారి లేకున్నా.. ప్రాణం కోసం పరుగెత్తిన 108.**



**సత్తుపల్లి, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పొట్లూరు వేణు (25) తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. అయితే బాధితుడి ఇంటికి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురైనా, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలట్ కట్టం మహేష్ ఏమాత్రం వెనుకడుగు వేయకుండా బాధితుడి వద్దకు చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అతడిని అంబులెన్స్‌లోకి తరలించి, మార్గమధ్యంలోనే అత్యవసర వైద్య సేవలు కొనసాగిస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి చేర్చారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన 108 సిబ్బంది సేవలను ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 108 మేనేజర్ ఆలేటి ప్రణయ్ కుమార్ అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పెద్దమందడిలో ఎస్ఐఆర్ ప్రక్రియ 89 శాతం పూర్తి



- **పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్**

**పెద్దమందడి,జూలై29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 89 శాతం పూర్తయిందని తహసీల్దార్ మల్లికార్జున్ తెలిపారు. ఇంకా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోని వారు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సంబంధిత సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. డబుల్ ఓట్లు కలిగిన వారి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి, నిబంధనల మేరకు తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు.మిగిలిన వారు సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని కోరారు. త్వరలోనే మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేస్తామని తహసీల్దార్ మల్లికార్జున్ ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థుల ద్వారా ప్రతి ఇంటికీ రోడ్డు భద్రత సందేశం



- **డీటీఓ అఫ్రీన్ సిద్ధిఖీ**

**ఎల్కతుర్తి, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తిలోని సెయింట్ థామస్ హైస్కూల్లో బుధవారం రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో టూ వీలర్ హెల్మెట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి (డీటీఓ) అఫ్రీన్ సిద్ధిఖీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వైష్ణవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా డీటీఓ అఫ్రీన్ సిద్ధిఖీ మాట్లాడుతూ, విద్యార్థులే రోడ్డు భద్రతకు నిజమైన రాయబారులని అన్నారు. పాఠశాలలో నేర్చుకున్న రోడ్డు భద్రతా నియమాలను ప్రతి విద్యార్థి తమ ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ కేవలం చట్టం కోసం కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని పేర్కొన్నారు.
పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో తరచూ నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు తెలియజేసి ప్రతి ఇంటికీ రోడ్డు భద్రత సందేశాన్ని చేరవేయాలని కోరారు. ప్రభుత్వం, రవాణా శాఖ సంయుక్తంగా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తే సమాజంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి కార్యక్రమాలకు సెయింట్ థామస్ హైస్కూల్ యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు లావణ్య, సరిత, సురేష్, ఆశా బేగం, రమేష్, సుమలత, లత, కృష్ణ, కవిత, కళ్యాణి, స్వప్న తదితరులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ, హెల్మెట్ వినియోగంపై తమ కుటుంబ సభ్యులు, బంధువులు, పరిసర ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## వీరాయపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి

- **సర్పంచ్ చిట్యాల వెంకటేష్**



**పెద్దమందడి,జూలై29(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ చిట్యాల వెంకటేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) కీలక పాత్ర పోషించారని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో బీఎల్ఓలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించారని కొనియాడారు.ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేందుకు కృషి చేసిన బీఎల్ఓలను సర్పంచ్ చిట్యాల వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





## అనారోగ్య బాధితులకు అండగా ఎమ్మెల్యే జారె

- **278 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు అధికారులకు సమర్పణ.**
- **హార్ట్ సర్జరీ బాధితుడికి రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత.**
- **ప్రజా సేవే శాశ్వతమని ఎమ్మెల్యే వ్యాఖ్య.**

**అశ్వారావుపేట, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించడంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మరోసారి చొరవ చూపారు. నియోజకవర్గానికి చెందిన 278 మంది అనారోగ్య బాధితుల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు. అదే రోజు అన్నపురెడ్డిపల్లి మండలం జానకిపురం గ్రామానికి చెందిన కట్టం రవి హృదయ శస్త్రచికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, చికిత్సకు అవసరమైన రూ.2.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) చెక్కును ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రికి వెళ్లి అందించారు. దీంతో బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక ఊరట లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య ఖర్చులు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన తనకు ప్రజల కష్టాలు ప్రత్యక్షంగా తెలుసని చెప్పారు. పదవిలో లేకున్నా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, గతంలోనూ అనేక మందికి సహాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవ మాత్రమే శాశ్వతంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు కుటుంబ సభ్యుడిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి,జూలై29(తెలంగాణ ముచ్చట్లు):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల సర్వే ప్రక్రియను నియోజకవర్గంలో నూరు శాతం విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేయడమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.బుధవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మండల స్థాయి నాయకులు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, బీఎల్ఏ2 ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పూర్తి ఉత్సాహంతో పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి కార్యకర్తే ప్రధాన బలమని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ కోసం అందరూ ఐక్యత, క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన విజయాలను సాధించగలమని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సమయం చాలా తక్కువగా ఉన్నందున, అందుబాటులో ఉన్న గడువులోనే 100 శాతం నమోదు పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బీఎల్ఏ2 ప్రతినిధులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపించాలని ఆదేశించారు.మండల నాయకులు ప్రత్యేక దృష్టి సారించి బీఎల్ఏ2ల పనితీరును ప్రతి రోజూ సమీక్షించాలని, అవసరమైన చోట తగిన మార్గనిర్దేశం చేయాలని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ శత్రురావు బుజ్జి, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, బీఎల్ఏ2 ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామ తల్లిదండ్రుల స్మృతి వనాన్ని సందర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్



**ఖమ్మం బ్యూరో, జులై 29(తెలంగాణ ముచ్చట్లు ):** జమ్మూ & కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం పర్యటనలో భాగంగా రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న నామ ముత్తయ్య-వరమ్మ స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులు నామ ముత్తయ్య, వరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి, నామ ముత్తయ్య-వరమ్మ జీవిత విశేషాలు, సమాజానికి అందించిన సేవల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. అక్కడ ప్రదర్శించిన అరుదైన చిత్రాలను పరిశీలించారు. ఆ గ్యాలరీ ఫోటోల విశేషాలను నామ సోదరుడు సీతయ్య వివరించారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన మొక్కలను, పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ నుంచి హైదరాబాద్ పయనమయ్యారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి

- **దశలవారీగా ప్రతీ కుటుంబానికి మంజూరు**
- **రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం**
- **కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**
- **ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన**

**ఖమ్మం బ్యూరో, జులై 29(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం-డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

నాలుగు విడతల్లో : నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే ధ్యేయం : రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీపై పొంగులేటి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలు

- **బీ జె పి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం**
- **ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బురదజల్లే ప్రయత్నం: డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**

**ఖమ్మం బ్యూరో , జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** జంతర్ మంతర్ వేదికగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి, ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని అసమర్థతకు నిదర్శనమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భావి భారత పౌరులైన విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడుతూ,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వ్యక్తిగత విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.

దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు, మహిళల భద్రత వంటి కీలక అంశాలపై ప్రజలు సమాధానం కోరుతుంటే, వాటిని పక్కనబెట్టి రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని చౌకబారు రాజకీయాలు చేయడం బీజేపీ వైఫల్యాన్ని బయటపెడుతోందన్నారు. అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తే అవే నిజాలవుతాయని బీజేపీ భ్రమపడుతోందని విమర్శించారు.

రాహుల్ గాంధీ దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం నిరంతరం గొంతెత్తుతున్న నాయకుడని, ఆయన లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత దాడులకు దిగడం అధికార పార్టీ బలహీనతకు నిదర్శనమన్నారు. విమర్శలకు బదులు వాస్తవాలతో సమాధానం చెప్పే సంస్కృతి బీజేపీకి లేదని ఎద్దేవా చేశారు.

జంతర్ మంతర్‌లో జరిగిన కార్యక్రమాన్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా సత్యాన్ని దాచలేరన్నారు. ప్రజల అసలు సమస్యలపై చర్చించకుండా ప్రతిపక్షంపై బురదజల్లడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజల తీర్పు అన్నింటికంటే గొప్పదని, అహంకారం, అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణలతో రాజకీయాలు చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నూతి సత్యనారాయణ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.





# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి : మంత్రి పొంగులేటి

- **రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన**
- **పేద పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తున్నామని వెల్లడి**
- **'ఉద్దీపకం-3' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం బ్యూరో, జులై 29(తెలంగాణ ముచ్చట్లు ):** "ప్రభుత్వ విద్యా రంగంలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను, అత్యుత్తమ వసతులను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టే ఖర్చే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.

**కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు బడులు**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సర్కారు బడులను నాణ్యమైన విద్యకు నిలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, ఆధునిక వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, సోలార్ ఫెన్సింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు.

**చదువే జీవితాన్ని మార్చే శక్తి**

తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. "పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగకూడదనేదే ప్రభుత్వ సంకల్పం. చదువు మాత్రమే మనిషి జీవితాన్ని, సమాజాన్ని మార్చగల శక్తి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి, నాణ్యమైన విద్యతో పాటు మంచి నైతిక విలువలను అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు శ్రద్ధ చూపుతున్న ఐటీడీఏ అధికారులను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఐటీడీఏ రూపొందించిన 'ఉద్దీపకం 3' పుస్తకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల చదువు పూర్తయ్యాక ఉపాధి కల్పనలో మార్గదర్శకత్వం వహించేందుకు 'వారధి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు పీవో వెల్లడించారు. అనంతరం మంత్రి పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన ఉదయ్ నాగరాజుకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి సత్కారం

- **మన తెలంగాణ బిడ్డ కావడం పట్ల హర్షం**
- **భారత్–యూకే సంబంధాల బలోపేతంలో ఆయన సేవలు కీలకమని ప్రశంస**




**ఖమ్మం బ్యూరో, జులై 29(తెలంగాణ ముచ్చట్లు ):** మన తెలంగాణ లోని కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయుడు, తొలిసారిగా బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన ఉదయ్ నాగరాజుకు న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలతో కలిసి హాజరై.. శాలువతో సత్కరించారు. యూకే లో స్థానిక రాజకీయాల్లో క్షేత్రస్థాయి నుంచి ఎదిగి హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ఎన్నిక కావడం అభినందనీయమని కొనియాడారు. భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య వివిధ రంగాల్లో సంబంధాల బలోపేతానికి ఉదయ్ నాగరాజు కృషి చేశారని, భవిష్యత్ లో మరింత సహకారం అందాలని ఆకాంక్షించారు.





# వ్యవసాయ పనుల్లో విషాదం.. ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి

- **అంకుశాపూర్‌లో దుర్ఘటన.. కుటుంబంలో విషాద ఛాయలు**

**జమ్మికుంట రూరల్ జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ రైతు మృతిచెందిన విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది.

పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుశాపూర్ గ్రామానికి చెందిన అరుకాల కుమారస్వామి తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో పనులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న కుమారస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు.

సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్ కింద నుంచి ఆయనను బయటికి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.

ఈ ఘటనతో అంకుశాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.





# ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

- **పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం బ్యూరో , జూలై - 29(తెలంగాణ ముచ్చట్లు):** జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు.



ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి వేళ గురువుకు ఘన సత్కారం

**వీణవంక, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):** గురు పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వీణవంకలో ఘనంగా గురు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితుడు జగదీశ్వర్ శర్మను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గురువులు జ్ఞానానికి మార్గదర్శకులని, సమాజాన్ని సన్మార్గంలో నడిపించే మహనీయులని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గురు-శిష్య పరంపరను భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుద్ధ మహేందర్ గుప్తా, పుప్పాల రఘు, శ్రీనివాస్ రావు, నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## సముద్రంలో నీరు.. హుజూరాబాద్ రైతులకు కరువు: కౌశిక్ రెడ్డి

**"ఇది ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అంటూ ప్రభుత్వంపై విమర్శలు**

**హుజూరాబాద్, జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు వెంటనే సాగునీరు అందించి పంటలను కాపాడాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని సిర్పపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన రైతుల పరిస్థితిని పరిశీలించి మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్నేపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి ఉంటే ఆ నీరు అన్నారం బ్యారేజ్, సుందిళ్ల, ఎల్లంపల్లి, నందిమేడారం, మిడ్ మానేరు మీదుగా ఎస్ఆర్ఎస్పీతో పాటు మల్లన్నసాగర్‌కు చేరేదని అన్నారు. కానీ లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిపోవడంతో హుజూరాబాద్ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. "ఇది ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి విమర్శించారు. సిర్పపల్లి గ్రామంలో వరి సాగు అధికంగా జరుగుతుందని, అయితే సాగునీటి కొరత కారణంగా పొలాలు బీడుగా మారాయని తెలిపారు. నీరు లేక రైతులు నాట్లు కూడా వేయలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోవడంతో బావుల్లో కూడా నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సాగునీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గ రైతుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామని, కన్నేపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకుని, నిలువున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు.




## ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సౌకర్యాలు కల్పించాలి: బీఎస్పీ

- **మౌలిక వసతుల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన**

**హుజురాబాద్, జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ నియోజకవర్గంలోని ఎంఆర్వో (ఎంఆర్ఓ), ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ జీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఎంఆర్వో, ఎంపీడీఓ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ అనేక చోట్ల మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, వెయిటింగ్ హాల్, కూర్చునేందుకు తగిన ఏర్పాట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలు మరింత ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.

అలాగే, కొందరు అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రజల పనులు ఆలస్యమవుతున్నాయని, మరికొందరు ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉండటం బాధాకరమని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నియోజకవర్గంలోని అన్ని ఎంఆర్వో, ఎంపీడీఓ కార్యాలయాల్లో పరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం, విశాలమైన వెయిటింగ్ హాల్, కూర్చునే ఏర్పాట్లు, దివ్యాంగులకు అనుకూలమైన ర్యాంపులు తదితర మౌలిక వసతులు కల్పించాలని మహేందర్ జీ కోరారు. ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని బీఎస్పీ తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.






## రాష్ట్ర సుభిక్షం కోసం కొండగట్టులో గిరిప్రదక్షిణ చేసిన వొడితల ప్రణవ్

- **వర్షాన్నిసైతం లెక్కచేయకుండా భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ**

**హుజూరాబాద్, జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కొండగట్టు అంజన్నను ప్రార్థించారు. బుధవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండగట్టు గిరిప్రదక్షిణలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణ సందర్భంగా కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు, కాంగ్రెస్ శ్రేణులు అంజన్న నామస్మరణతో ప్రదక్షిణ పూర్తి చేశారు. ఈ వర్షాన్ని స్వామి వారి అనుగ్రహంగా భావిస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, కొండగట్టు అంజన్న ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు ఎల్‌నీనో ప్రభావం వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని కోరుకున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం పాడి పంటలతో కళకళలాడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తలు ఎల్‌నీనో ప్రభావంపై హెచ్చరిస్తున్న సమయంలో కరువుకు కాంగ్రెస్ కారణమని చెప్పడం అవివేకమని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు బదులుగా రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితులు, రైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలవనివ్వరా?

- **ప్రజల తరపున ప్రశ్నిస్తే పోలీసుల అడ్డగింత ఎందుకని ప్రభుత్వాన్ని నిలదీత**

**హుజూరాబాద్, జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు.

దళితులకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతుల సాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాల రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని దెబ్బతిన్న రహదారులను కూడా అత్యవసరంగా పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం అందించడానికి వెళ్తే వందలాది మంది పోలీసులను మోహరించి అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దళితులు, రైతులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకునే హక్కును కూడా హరించడం తగదని అన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని అడ్డుకోవడం కాకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

హుజూరాబాద్ ప్రజల హక్కుల పరిరక్షణ, దళితులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

## దళితులు, రైతుల సమస్యలపై కలెక్టర్‌ను కలవనివ్వరా?

- **ప్రజల తరపున ప్రశ్నిస్తే పోలీసుల అడ్డగింత ఎందుకని ప్రభుత్వాన్ని నిలదీత**

**హుజూరాబాద్, జూలై 29(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు.

దళితులకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతుల సాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను తక్షణమే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాల రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని దెబ్బతిన్న రహదారులను కూడా అత్యవసరంగా పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.




ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం అందించడానికి వెళ్తే వందలాది మంది పోలీసులను మోహరించి అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దళితులు, రైతులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకునే హక్కును కూడా హరించడం తగదని అన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని అడ్డుకోవడం కాకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

హుజూరాబాద్ ప్రజల హక్కుల పరిరక్షణ, దళితులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# విస్తరణపై సింగరేణి దృష్టి

- ఆప్మెల్‌కు సౌర శక్తి
- స్వర్ణోత్సవ వేళ 300 కిలోవాట్ల ప్లాంట్ ప్రారంభం
- విద్యుత్ ఖర్చులో భారీ ఆదా
- రికార్డు లాభాలతో కొత్త చరిత్ర

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):

సింగరేణి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఆప్మెల్) స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడ ప్లాంటులో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ రోడ్లను కూడా ప్రారంభించి మౌలిక సదుపాయాల విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితో పాటు ఆప్మెల్‌ను బహుముఖ వ్యాపార సంస్థగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ కొనసాగుతోందన్నారు. సంస్థ 50 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్‌తో పాటు రూ.23.33 కోట్ల రికార్డు స్థాయి నికర లాభాన్ని నమోదు చేయడం ఉద్యోగుల సమష్టి కృషికి నిదర్శనమని అభినందించారు.

గత ఏడాది ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సందర్భంగా ఇచ్చిన సూచనల మేరకు ప్లాంటులో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. సీసీ, ఆర్‌సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్లాంటు నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1, 1976న ప్రారంభమైన ఆప్మెల్ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సంస్థను ఆధునిక అవసరాలకు అనుగుణంగా విస్తరించాలని సీఎండీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం తయారుచేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు వివిధ పరిశ్రమలకు అవసరమైన ఆధునిక ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సింగరేణి నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

రూ.1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా సంస్థ విద్యుత్ వినియోగ వ్యయంలో గణనీయమైన ఆదా సాధించనుంది. ప్లాంటు, కాలనీ అవసరాల కోసం ప్రస్తుతం ఏటా సుమారు రూ.60 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న సంస్థకు ఈ సౌర విద్యుత్ ప్లాంట్ వల్ల ఏటా సుమారు రూ.24 లక్షల వరకు ఆదా కానుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తం తిరిగి సమకూరడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడనుంది. ఆప్మెల్ ఛైర్మన్ ఎన్‌వీకే శ్రీనివాస్ సంస్థ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్‌ఎండీసీ వంటి సంస్థల నుంచి వచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, సింగరేణి అధికారులు, విజయవాడ ఆప్మెల్ యాజమాన్యం, ఉద్యోగులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవ సంవత్సరంలో సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# కంగనా క్షమాపణ చెప్పాలి

- జెన్ జీ యువత, మహిళలపై వ్యాఖ్యలపై సీపీఐ ఆగ్రహం
- బాధితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నారాయణ డిమాండ్
- ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- సుప్రీంకోర్టు వైఖరిని ప్రశంసించిన సీపీఐ నేత

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):

జెన్ జీ యువత, మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.నారాయణ విమర్శించారు. తన వ్యాఖ్యలతో సమాజంలో పలువురి మనోభావాలను దెబ్బతీసిన కంగనా రనౌత్ బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు, ముఖ్యంగా ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సమయంలో సంయమనం, బాధ్యతతో వ్యవహరించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలు సృష్టించేలా, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రజా వేదికలపై మాట్లాడే ప్రతి మాట సమాజంపై ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోవాలని సూచించారు.

జెన్ జీ యువత, మహిళలపై చేసిన వ్యాఖ్యలు అనేక మందిలో ఆవేదన కలిగించాయని నారాయణ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు సమాజంలోని అన్ని వర్గాల భావోద్వేగాలను గౌరవిస్తూ వ్యవహరించాలని, వివాదాస్పద వ్యాఖ్యలతో సామాజిక విభేదాలను పెంచకూడదని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన "బొద్దింకలు" వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును నారాయణ ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నాన్ని స్వాగతించడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. తప్పును గుర్తించి దిద్దుకునే వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని నారాయణ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ మాటల ప్రభావాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. కంగనా రనౌత్ తన వ్యాఖ్యలపై పునరాలోచించి, వాటి వల్ల మనస్తాపానికి గురైన యువత, మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నారాయణ పునరుద్ఘాటించారు. సమాజంలో పరస్పర గౌరవం, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు బాధ్యతాయుతమైన వ్యవహారశైలి అవసరమని ఆయన పేర్కొన్నారు.

# చక్కెర నిల్వలపై కేంద్రం కీలక ఆంక్షలు

- డీలర్లకు కొత్త నిల్వ పరిమితులు
- 30 రోజులకు మించి నిల్వలకు నో
- గరిష్ఠంగా 4 వేల క్వింటాళ్లకే అనుమతి
- ఆగస్టు 1 నుంచి అమల్లోకి ఆదేశాలు

న్యూఢిల్లీ, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):



దేశంలో చక్కెర ధరలను నియంత్రించి వినియోగదారులకు అందుబాటు ధరల్లో సరఫరా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర డీలర్లు 30 రోజులకు మించి నిల్వలు ఉంచకూడదని, గరిష్ఠంగా నాలుగు వేల క్వింటాళ్ల వరకు మాత్రమే నిల్వ ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలు ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు అమల్లో ఉంటాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం చక్కెర డీలర్లు సరుకును సమకూర్చుకున్న తేదీ నుంచి 30 రోజులకు మించి నిల్వ ఉంచడానికి వీలుండదు. అలాగే దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఒక డీలర్ నాలుగు వేల క్వింటాళ్లకు మించిన చక్కెర నిల్వలను కలిగి ఉండరాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ చర్యల ద్వారా కృత్రిమ కొరతను సృష్టించడం, ధరలను పెంచే ప్రయత్నాలను అరికట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

నిల్వల వివరాలను ప్రతి రోజు ఆహార నిల్వల పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కేంద్రం ఆదేశించింది. డీలర్లు తమ వద్ద ఉన్న నిల్వలు, కొనుగోలు, విక్రయాల వివరాలను నిరంతరం నవీకరించాల్సి ఉంటుంది. దీంతో చక్కెర నిల్వలపై కేంద్రానికి ప్రత్యక్ష పర్యవేక్షణ సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించింది. దేశీయ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం, మార్కెట్లో తగినంత నిల్వలు ఉండేలా చూడడం, ధరలు అదుపులో ఉండేలా చర్యలు చేపడుతోంది. తాజా నిల్వ పరిమితులు కూడా అదే దిశలో తీసుకున్న నిర్ణయంగా అధికారులు వివరించారు.

అయితే ఈ నిల్వ పరిమితులు ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన డీలర్లకు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చక్కెర పంపిణీ చేసే అధికారులకు వర్తించవని కేంద్రం స్పష్టం చేసింది. సాధారణ వాణిజ్య డీలర్లకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. చక్కెర మార్కెట్‌లో పారదర్శకతను పెంచడంతో పాటు నిల్వల పేరుతో జరిగే అక్రమాలపై నియంత్రణ సాధించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నిల్వ పరిమితులను ఉల్లంఘించే డీలర్లపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ధరల స్థిరీకరణ, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తుందని పేర్కొంది.

# నదీ జలాలపై కీలక చర్చ

- ఢిల్లీలో తెలంగాణ–కర్ణాటక నేతల భేటీ
- కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో సమావేశం
- తుంగభద్ర, కృష్ణా జలాలపై సమాలోచనలు
- అంతర్రాష్ట్ర జల సమస్యల పరిష్కారంపై దృష్టి

న్యూఢిల్లీ, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):





అంతర్రాష్ట్ర నదీ జలాల అంశాలపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య కీలక చర్చలు జరిగాయి. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమై ఇరు రాష్ట్రాలకు సంబంధించిన జల అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జలాల పంపిణీ, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. జల వనరుల వినియోగంలో పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నేతలు ప్రస్తావించారు.

నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన నీటి లభ్యత, భవిష్యత్ కార్యాచరణ, నదీ జలాల సమర్థ వినియోగంపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని చర్చించారు. రైతుల సాగునీటి అవసరాలు, తాగునీటి భద్రత, జల వనరుల పరిరక్షణ వంటి అంశాలపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అంతర్రాష్ట్ర జలాల అంశాల్లో సహకార స్ఫూర్తితో ముందుకు సాగాలని ఇరు రాష్ట్రాల నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల మధ్య జల సంబంధిత అంశాలపై సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా మారనుంది. తుంగభద్ర, కృష్ణా నదీ జలాల అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు ఇరు రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నట్లు సమావేశంలో స్పష్టమైంది.

# చెరకు సాగుకు కార్యాచరణ

- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణపై సమీక్ష
- ఇతర రాష్ట్రాల విధానాల అధ్యయనానికి ఆదేశం
- రైతులకు ప్రోత్సాహకాలపై ప్రతిపాదనలు
- ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమలను పునరుద్ధరించి వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు సాగు విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల ప్రస్తుత పరిస్థితి, చెరకు సాగు విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిశ్రమలకు ముడి చెరకు లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం కేవలం ఏడు కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. వరి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతులను అనుసరిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. 2026-27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ప్రోత్సాహక పథకాలు, విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను తక్షణమే సమర్పించాలని సంబంధిత అధికారులకు ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు నిరంతరం అందేలా రైతులను ప్రోత్సహించే చర్యలను రూపొందించాలని సూచించారు. సమావేశంలో రైతు ప్రతినిధులు చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత ప్రధాన సమస్యలుగా ఉన్నాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తే రైతులకు, పరిశ్రమలకు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

# అవయవదానంతో అమరత్వం

- బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానం

హైదరాబాద్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన 25 ఏళ్ల పెండ్ర మనోజ్ కుమార్ అవయవదానం ద్వారా ఐదుగురికి కొత్త జీవితాన్ని అందించారు. కుమారుడిని కోల్పోయిన తీవ్ర విషాదంలోనూ ఆయన తండ్రి శ్రీనివాస్ తీసుకున్న మానవతా నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. వైద్యులు మనోజ్ కుమార్ బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించిన అనంతరం, ఆయన తండ్రి శ్రీనివాస్ తన కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఈ నిర్ణయంతో ఐదుగురు అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు కొత్త ఆశ లభించింది. కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.

కొడుకును కోల్పోయిన బాధ ఏ తల్లిదండ్రులకైనా తీరనిదే. అయినప్పటికీ, ఆ బాధను పక్కనపెట్టి మరొకరి ప్రాణాలను కాపాడాలనే గొప్ప సంకల్పంతో ముందుకొచ్చిన శ్రీనివాస్ నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని వైద్యులు, సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి. అవయవదానం ద్వారా



మరణానంతరం కూడా పలువురి జీవితాల్లో వెలుగు నింపవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్లతో పాటు ఇతర అవయవాల దానం ద్వారా అనేక మందికి పునర్జన్మ లభించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. అవయవదానం ఒక మహోన్నతమైన మానవతా సేవగా అభివర్ణిస్తున్నారు.

రాష్ట్రంలో అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్నప్పటికీ, ఇంకా మరింత మంది ముందుకు రావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను సమయానికి దానం చేస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యుల్లో కూడా అవగాహన పెరగాలని కోరుతున్నారు. పెండ్ర మనోజ్ కుమార్ కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మరణం జీవితానికి ముగింపు అయినప్పటికీ, అవయవదానం ద్వారా మరొకరి జీవితంలో కొత్త ఆశలు నింపవచ్చని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది. ప్రతి ఒక్కరూ అవయవదానంపై సానుకూల దృక్పథంతో ముందుకు వచ్చి ప్రాణాపాయంలో ఉన్నవారికి జీవనదాతలుగా మారాలని వైద్యులు పిలుపునిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మానవ అక్రమ రవాణా ఉచ్చులో ప్రపంచం

- **స్వేచ్ఛను కబళిస్తున్న అక్రమ రవాణా**
- **ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ముఠాలు**
- **మానవ అక్రమ రవాణాపై ప్రపంచ హెచ్చరిక**

**డెస్క్, జూలై 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న మానవ అక్రమ రవాణా ఇప్పుడు కొత్త రూపం దాల్చింది. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, అధిక వేతనాల పేరుతో యువతను మోసగించి ఆన్‌లైన్ మోస కేంద్రాల్లో బలవంతంగా పనిచేయిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూలై 30న నిర్వహించే మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవానికి ఈ ఏడాది "ఆన్‌లైన్ మోసాల వెనుక చిక్కుకున్న జీవితాలు" అనే అంశాన్ని ప్రధాన సందేశంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. మోసపూరిత ఉద్యోగ ప్రకటనల ద్వారా వేలాది మంది అంతర్జాతీయ నేర ముఠాల బారిన పడుతున్నారని హెచ్చరించింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో యువతకు అధిక జీతాలు, సాంకేతిక ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కల్పిస్తామని చెప్పి తీసుకెళ్లిన తర్వాత వారిని నిర్బంధించి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా బలవంతం చేస్తున్నట్లు ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. నిరాకరిస్తే శారీరక హింస, బెదిరింపులు, నిర్బంధం వంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ నేరాల వెనుక అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠాలు, సైబర్ నేరాలు, నల్లధన చలామణి పరస్పరం అనుసంధానమై ఉన్నాయని వెల్లడించింది.

మానవ అక్రమ రవాణా ఇప్పుడు కేవలం లైంగిక దోపిడీ లేదా బలవంతపు శ్రమకే పరిమితం కావడం లేదు. డిజిటల్ యుగంలో నేరగాళ్లు సామాజిక మాధ్యమాలు, నకిలీ ఉద్యోగ వెబ్‌సైట్లు, సందేశాల వేదికలు, తప్పుడు నియామక సంస్థలను వినియోగించి బాధితులను వలలో వేసుకుంటున్నారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను సేకరించి వారిని విదేశాలకు రప్పించి, అక్కడ అక్రమ మోస కేంద్రాల్లో బంధించి సైబర్ మోసాలకు ఉపయోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా ఈ ఏడాది సందేశంలో బలవంతపు ఆన్‌లైన్ మోస కేంద్రాలు మానవ అక్రమ రవాణాలో అత్యంత వేగంగా పెరుగుతున్న రూపంగా మారాయని హెచ్చరించారు. కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను కూడా నేరగాళ్లు తమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే ప్రపంచ దేశాలు సమాచార భాగస్వామ్యం, చట్ట అమలు సంస్థల సమన్వయం, ఆర్థిక నేరాల నియంత్రణలో మరింత బలంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

భారత్‌లో కూడా ఉద్యోగాల పేరుతో విదేశాలకు వెళ్లే యువత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన నియామక సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం, ఒప్పంద పత్రాలను పూర్తిగా పరిశీలించడం, కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం అందించడం, గుర్తింపు లేని వ్యక్తులు లేదా సంస్థల ఆఫర్లను నమ్మకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా మధ్య సంబంధం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ అవగాహన కూడా అత్యంత అవసరమని చెబుతున్నారు. మానవ అక్రమ రవాణా అనేది మానవ హక్కులపై జరిగే అత్యంత దారుణమైన దాడుల్లో ఒకటి. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉంది. అనుమానాస్పద నియామకాలు, అక్రమ తరలింపులు, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపై వెంటనే అధికారులకు సమాచారం అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, మానవ గౌరవాన్ని కాపాడే సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిస్తోంది.





## నటిగా మారడం కోసం కష్టాలు అనుభవించిన భాగ్యశ్రీ బోర్సే!

తెలుగు చిత్రసీమలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ మహారాష్ట్ర భామ, ఇటీవల ఒక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

చిన్నప్పటి నుంచే నటనపై తనకు అమితమైన ఆసక్తి ఉండేదని భాగ్యశ్రీ తెలిపారు. అయితే చలనచిత్ర రంగంలోకి రావాలన్న తన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు మొదట అస్సలు అంగీకరించలేదని చెప్పారు.

"జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలకు చివరికి మనమే బాధ్యత వహించాలి. ఇతరుల కోసం మన కలలను వదులుకుంటే తర్వాత బాధపడాల్సి వస్తుంది. అందుకే నటిగా మారాలనుకుంటున్నానని ముందుగా అమ్మకు చెప్పాను. కానీ ఆమె వెంటనే వద్దని చెప్పింది. తర్వాత నాన్నతో మాట్లాడితే, అమ్మ వద్దన్న పని ఎలా చేస్తావని అడిగారు. కనీసం సోదరి అయినా నాకు మద్దతు ఇస్తుందనుకుంటే, ఆమె కూడా అమ్మానాన్నల మాటే వినాలని చెప్పింది. ఇంట్లో అందరూ నా నిర్ణయాన్ని వ్యతిరేకించారు" అని ఆమె గుర్తు చేసుకున్నారు.

కుటుంబం నుంచి వ్యతిరేకత ఎదురైనా తన కలను వదులుకోలేదని భాగ్యశ్రీ చెప్పారు. "నేను ఎంపిక పరీక్షలకు (ఆడిషన్స్) వెళ్లడం మొదలుపెట్టిన తర్వాత ఇంట్లో పరిస్థితి మరింత కఠినంగా మారింది. నా నిర్ణయం నచ్చక అమ్మ దాదాపు ఆరు నెలల పాటు నాతో మాట్లాడలేదు. అంతర్జాల సందేశాల వేదికల్లో (వాట్సాప్) కూడా నన్ను నిరోధించింది (బ్లాక్ చేసింది). ఇప్పుడు ఆ విషయాలను నవ్వుకుంటూ చెప్పగలుగుతున్నా.. ఆ రోజుల్లో మాత్రం చాలా బాధపడ్డాను. అయితే తల్లిదండ్రులకు సినిమా పరిశ్రమపై కొన్ని భయాలు ఉండటం సహజం. అందుకే వారు అలా స్పందించారు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

కుటుంబ సభ్యుల అభ్యంతరాలను అధిగమించి సినీ రంగంలో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన అందం, అభినయంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు వరుస అవకాశాలు లభించాయి. ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన 'కింగ్‌డమ్', రామ్ పోతినేనితో 'ఆంధ్ర కింగ్ తాలూకా', దుల్కర్ సల్మాన్‌తో 'కాంత' వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నారు. అయితే అఖిల్ అక్కినేనితో చేసిన 'లెనిన్' సినిమా ఆమె ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచింది. ఇందులో 'భారతి' పాత్రలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి.

## డ్రాగన్ షూటింగ్‌కు బ్రేక్!

తెలుగు చిత్రసీమలో ప్రముఖ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ గత కొన్ని వారాలుగా వివిధ కారణాలతో వార్తల్లో నిలుస్తున్నారు. ఒకవైపు ఆయన నటిస్తున్న నూతన చిత్రం 'డ్రాగన్' చిత్రీకరణ పదేపదే వాయిదా పడుతుండగా, మరోవైపు చిత్రీకరణ సమయంలో ఆయన గాయపడటం, సామాజిక మాధ్యమాల్లో చోటుచేసుకున్న వివాదాలు అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో ఎన్టీఆర్ త్వరగా పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకుని మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' చిత్రంపై మొదటి నుంచే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా ప్రారంభమైన నాటి నుంచే అనేక ఊహించని కారణాల వల్ల చిత్రీకరణకు వరుసగా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో చిత్రీకరణ సాగుతున్న సమయంలో ఎన్టీఆర్ గాయపడటంతో కొన్ని రోజుల పాటు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ తర్వాత విదేశాల్లో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం వల్ల జార్జియా దేశంలో ముందుగా అనుకున్న చిత్రీకరణ ప్రణాళికను మధ్యలోనే నిలిపివేసి వెనక్కి రావలసి వచ్చింది. ఆ తర్వాత కథకు సంబంధించిన కొన్ని కీలక మార్పులు, సుదీర్ఘ చర్చల కారణంగా కూడా చిత్రీకరణ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

ఒకవైపు ఆశించిన స్థాయిలో సినిమా చిత్రీకరణ జరగకపోవడం, మరోవైపు వరుస గాయాలు, సామాజిక మాధ్యమాల్లో లేనిపోని వివాదాలు చోటుచేసుకోవడంతో ఎన్టీఆర్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఆయన త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి వచ్చి చిత్రీకరణలో పాల్గొనాలని కోరుకుంటున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in